అపరిశుభ్రం.. దుర్గంధభరితం

- పంచాయతీల్లో కనిపించని పారిశుధ్యం
- పట్టించుకోని అధికారులు

మండలం	యల్లనూరు
పంచాయతీలు	21
గ్రామాలు	39
జనాభా	36 వేలు
చెత్త సంపద కేంద్రాలు	21
పారిశుధ్య కార్మికులు	37 మంది


యల్లనూరులోని శివాలయం ఎదుట అపరిశుభ్రంగా ఉన్న దృశ్యం


జెడ్పీ హైస్కూల్ వద్ద పేరుకుపోయిన మురుగు

యల్లనూరు: పంచాయతీల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. చెత్త కుప్పలు, చికెన్, మటన్ వ్యర్థాలు దిబ్బలు దిబ్బలుగా పేరుకుపోయాయి. 21 గ్రామ పంచాయతీలకు గాను ఐదారు మినహా మిగిలిన పంచాయతీల్లో చెత్త, అపరిశుభ్రం తాండవిస్తోంది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పంచాయతీల్లో పర్యటించిన రోజు హడావిడి చేసి ఓ మోస్తారుగా శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లిస్తున్నారు. పంచాయతీల్లో శుభ్రం చేసేందుకు ఆదాయ వనరులు ఉన్నా ఖర్చు చేయకుండా అడపాదడపా ఖర్చు పెట్టి మమ అని పిస్తున్నారు. మేజరు పంచాయతీల్లో ఆదాయం ఉన్నా ...పారిశుధ్య కార్మికుల కొరత లేకున్నా వీధుల్లో చెత్తాచెదారం కనిపిస్తోంది. ప్రధాన రహదారులే కాదు అంతర్గత రహదారుల్లో కూడా పట్టించుకునేవారు లేరు.

అభివృద్ధికి ఆమడదూరం

చాలా పంచాయతీలు అభివృద్ధికి ఆమడ దూరంగా ఉంటున్నాయి. గ్రామాల్లోని సమస్యలను పంచాయతీ కార్యదర్శులు గాలికొదిలేశారు. పంచాయతీ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు ఉండటంతో రెగ్యులర్ పంచాయతీలతో పాటు అదనపు పంచాయతీలకు న్యాయం చేయలేకున్నారు. జన సంచారం అధికంగా ఉన్న యల్లనూరుతో పాటు పలు కొన్ని పంచాయతీల్లో పాతపేట పెద్దమ్మగుడి వద్ద చెత్తాచెదారం, రజకవీధుల్లో వర్షం వస్తే రోడ్లు లేక అధ్వాన స్థితి ఉంటోంది. కుమ్మర వీధి నుంచి డ్రైనేజీలు లేక మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. మురుగు నీటిలో పాతపేటవాసులు రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే ఆంజనేయస్వామి గుడి వద్ద వర్షం నీరు నిల్వ ఉంటోంది. ఎన్ని సార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోలేదంటూ కాలనీవాసులు వాపోయారు. మురుగునీరు శివాలయం, మసీదు వరకు ప్రవహిస్తున్నాయి. అలాగే ఆసుపత్రి వద్ద డ్రైనేజీ మురుగు, వర్షం నీరు ప్రవహించకపోవడంతో కాల్వలు నిండి జెడ్పీ హైస్కూల్ వద్ద పేరుకుపోతోంది. దీంతో అపరిశుభ్రం నెలకొని దోమలు విజృంభిస్తున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రత్యేకాధికారులు కార్యదర్శులు పంచాయతీల అభివృద్ధి శుభ్రతపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మూలన పడిన ట్రై సైకిళ్లు


పాత సచివాలయం వద్ద మూలకు చేరిన స్వచ్ఛ సంకల్పం ట్రై సైకిళ్లు

మండల వ్యాప్తంగా చెత్త సంపద కేంద్రాలు అలంకార ప్రాయంగా మారాయి. గత ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చుచేసి నూతనంగా చెత్త సంపద కేంద్రాలను ఏర్పాటు చేస్తే దిష్టి బొమ్మల్లా మారాయి. చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చెత్త సంపద కేంద్రానికి తీసుకెళ్లి తడి చెత్త, పొడి చెత్తను వేరుచేసి వర్మికంపోస్టు విక్రయాల వచ్చిన ఆదాయంతో పంచాయతీలను అభివృద్ధి చేయాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. చెత్తను తీసుకెళ్లే ట్రై సైకిళ్ల పాత సచివాలయం వద్ద మూలకు చేరాయి. ఉన్నతాధికారులు స్పందించి చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్యం మెరుగుపరుస్తాం



మండలంలోని 21 పంచాయతీల్లో అపరిశుభ్రం లేకుండా చూస్తాం. పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి మెరుగైన సేవలు అందిస్తాం. చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువస్తాం. ఆదాయ వనరులను పెంచి పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం.
– వాసుదేవరెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం


ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

బుక్కరాయసముద్రం: తాగునీటి సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప మండిపడ్డారు. శుక్రవారం తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేజర్ పంచాయతీలోని పూసల కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం తాగునీటి పథకాలకు ఇంత వరకు ప్రణాళికలు సిద్ధం చేయలేదన్నారు. అలాగే డ్రైనేజీలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు నాగేంద్ర, పుల్లయ్య, నాగరాజు, చంటి, చెన్నప్ప, రాములమ్మ, చిట్టెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షానికి పంట నష్టం


బూదేడులో గాలీవానకు దెబ్బతిన్న అరటి పంటను పరిశీలిస్తున్న అధికారులు

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి అరటి, వరి తదితర పంటలకు నష్టం జరగడంతో శుక్రవారం తహసీల్దార్ ఈరమ్మతో కలసి క్షేత్ర స్థాయిలో పంటలు పరిశీలించినట్లు ఏఓ సోమశేఖర్ తెలిపారు. ఏఓ మాట్లాడుతూ 39 మి.మీ. వర్షపాతం నమోదైందన్నారు. మర్తాడు, బూదేడు, ఇల్లూరు, కొప్పలకొండ, కేశవాపురం గ్రామాల్లో వరి 12 హెక్టార్లు, అరటి 6 హెక్టార్లలో నష్టం జరగడంతో నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపామన్నారు.

గేట్స్ కళాశాల వార్షికోత్సవ సంబరాలు


వేడుకలను ప్రారంభిస్తున్న దృశ్యం

గుత్తి: గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదల క్రమశిక్షణ, సత్ప్రవర్తనను కలిగి ఉండాలన్నారు. అంతేకాకుండా శాస్త్ర సాంకేతిక రంగంలో మార్పులను గమనించి కొత్త ఆవిష్కరణలు చేసే నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ(ఏఐ)పై పట్టు సాధించాలన్నారు. కళాశాలలో ఏఐకి సంబంధించిన రీసెర్చ్ సెంటర్ కూడా ప్రారంభించామన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వీకే పద్మావతి, డైరెక్టర్ శ్రీవాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్‌బాషా, కోర్డినేటర్లు డాక్టర్ అర్పిక్ ప్రవీణ్, మోహన్‌దాస్, విద్యార్థులు , తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా ఇండియన్ స్కూల్ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న అతిథులు

గుంతకల్లు: స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో శుక్రవారం సాయంత్రం ఇండియన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ 10వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కరస్పాండెంట్ ఆర్.పవన్‌గౌడ్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పట్టణ వ్యాపారవేత్త రామ్‌మోహన్‌గుప్తా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యశోద, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ముందు వెళుతున్న ఆటోను వెనకనుంచి ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో రవి, ధనుంజయ గాయపడ్డారు. రాయలచెరువుకు చెందిన రవి, ధనుంజయ బైక్‌లో గుత్తికి వచ్చి తిరిగి వెళుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

లింగ వివక్ష నిర్మూలనపై అవగాహన


మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్

గుంతకల్లు రూరల్: లింగ వివక్షపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆర్డీఓ శ్రీనివాస్ సూచించారు. గర్భస్థ లింగ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ముఖ్యంగా లింగ వివక్షతపై డివిజనల్ స్థాయి, నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి, గ్రామ స్థాయిల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ప్రైవేట్‌స్కానింగ్ సెంటర్లపై విస్తృతంగా నిఘా ఉంచేడంతోపాటు, క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలన్నారు. గర్భ నిరోధక మాత్రలు యథేచ్ఛగా విక్రయిస్తున్న తరుణంలో మెడికల్ స్టోర్స్‌లో నిఘా ఉంచాలన్నారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ జెడ్పీ హైస్కూల్స్, కేజీబీవీ, మోడల్ స్కూల్స్‌లో ఆడపిల్లలకు బాల్య వివాహాల నిరోధక చట్టంతోపాటు, లింగ వివక్షపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ సుజాత, పీడియాట్రిషన్స్ డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ అరుణ, డాక్టర్ హరిత బాయ్, పీపీ యూనిట్‌మెడికల్ ఆఫీసర్స్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై ఏఎస్పీకి ఫిర్యాదు


మీ మాటే ముఖ్యం కార్యక్రమం నిర్వహిస్తున్న ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి

తాడిపత్రిటౌన్: తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై అనుచిత వాఖ్యలు చేసిన టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ తాడిపత్రి నియోజకవర్గ బూత్‌కమిటీ సభ్యుడు రవితేజారెడ్డి ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి నిర్వహించిన మీ మాటే ముఖ్యం కార్యక్రమంలో మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొంకిరి కమలమ్మ, టీడీపీ మున్సిపల్ కౌన్సిలర్ కొత్తపల్లి మల్లికార్జునపై ఆయన ఫిర్యాదు అందజేశారు. పలుమార్లు వారు నిర్వహించిన ప్రెస్‌మీట్‌లలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని ఇష్టానుసారంగా దూషిస్తూ అవమానకరంగా మాట్లాడుతూ రెచ్చగొట్టేలా వాఖ్యలు చేశారన్నారు. కేతిరెడ్డి పెద్దారెడ్డితో పాటు ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని, వారి కుటుంబ సభ్యులను కించపరిచేలా మాట్లాడారన్నారు. అలాగే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి వెనుక భగత్‌సింగ్ కాలనీ ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వ్యక్తులు తిరుగుతూ 'కేతిరెడ్డి పెద్దారెడ్డి.. నీవు తాడిపత్రికి రాలేవు, నీ అంతు చూస్తాం' అంటూ కేకలు వేస్తున్నారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి మరో నాలుగు అర్జీలు వచ్చాయని ఏఎస్పీ తెలిపారు. కార్యక్రమం అనంతరం పట్టణ రౌడీషీటర్‌లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

కరువు మండలంగా ప్రకటించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ విశాలాక్షి

గుత్తి రూరల్: మండలంలో అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు పండక రైతులు తీవ్రంగా నష్టపోయారని గుత్తి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో మండలంలోని సమస్యలపై సర్పంచ్, ఎంపీటీసీలు ఏకరువు పెట్టారు. సబ్సిడీ కింద వ్యవసాయ పరికరాలు ఇవ్వాలని ఇసురాళ్లపల్లి సర్పంచ్ వాసుదేవరెడ్డి కోరారు. మండలంలోని రైతులకు సరిపడా పరికరాలు రాలేదని జేడీఏకు నివేదిక పంపి మంజూరుకు కృషి చేస్తామని వ్యవసాయాధికారి ముస్తాక్ అహ్మద్ తెలిపారు. బ్యాంకుల ద్వారా కౌలు రైతులకు రుణాలు ఇప్పించాలని లచ్చానుపల్లి సర్పంచ్ మజ్జిగగోపాల్ కోరారు. చెర్లోపల్లి–మార్నేపల్లి గ్రామాల మధ్యలో కల్వర్టు నిర్మించాలని తద్వారా పెద్దొడ్డి గ్రామంలోని సచివాలయానికి వెళ్లేందుకు దూరం తగ్గుతుందని సర్పంచ్ అప్పా వెంకటేష్ డిమాండ్ చేశారు. మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి కోరారు. తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, ఈఓఆర్డీ శివాజీరెడ్డి, సీఎస్‌డీటీ సూర్యనారాయణ, సర్పంచ్‌లు లహరిరెడ్డి, రమేష్‌బాబు, రాజేశ్వరి, బేడల లక్ష్మీదేవి, పాపన్న, భరత్‌కుమార్, ఎంపీటీసీలు సుమలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశ్విని, హెచ్‌ఓ మిత్ర విందమాధవి, కార్యదర్శి ధనలక్ష్మి పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

గార్లదిన్నె/పెద్దవడుగూరు: అనంతపురంలో ఈ నెల 8న ఉద్యాన రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు సీపీఐ రైతు సంఘం నాయకులు శ్రీనాథ్ చౌదరి తెలిపారు. శుక్రవారం గార్లదిన్నెలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాయలసీమ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా ప్రకటించినా, పంటలకు మద్దతు ధర లేదన్నారు. హార్టికల్చర్ సదస్సుకు ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. మండలంలోని రైతులు అధిక సంఖ్యలో హాజరై సదస్సును జయప్రదం చేయాలన్నారు.

▸▸ పెద్దవడుగూరు మండలంలోని చిన్నవడుగూరు, దిమ్మగుడి, ఆవులాంపల్లి, విరుపాపురం తదితర గ్రామాల్లోని పండ్ల తోటలను సీపీఐ మండల నాయకుడు సూర్యనారాయణరెడ్డి, కార్యదర్శి వెంకట్రాముడుయాదవ్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ పండ్ల తోటలు సాగు చేసిన రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గిట్టుబాటు ధర లేక రైతులు నష్ట పోతున్నారన్నారు. రైతు సమస్యలు చర్చించడానికి, గిట్టుబాటు ధరలు కల్పించుకోవడానికి ఈ నెల 8న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రైతు సదస్సుకు రైతులు హాజరు కావాలన్నారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆదినారాయణ, రంగస్వామి, అల్లాబకాస్, రంగనాయకులు, సుధాకర్‌గౌడ్, నాగేంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

డెంగీ రాకుండా జాగ్రత్తలు తీసుకోండి


నాగులగుడ్డం తండాలోని ఓ ఇంట్లో స్ప్రే చేస్తున్న జిల్లా మలేరియా అధికారి ఓబులు

శింగనమల: డెంగీ, మలేరియా జ్వరాలు రాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి ఓబులు సూచించారు. గురువారం మండలంలోని నాగులగుడ్డం తండా గ్రామంలో పర్యటించి, ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో కొందరికి డెంగీ జ్వర లక్షణాలు కన్పించడంతో రెండు రోజులు పాటు ఇంటింటి సర్వే చేశారు. ఈ క్రమంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించి, అవసరమైన వారికి మందులను అందజేశారు. అనంతరం దోమలు రాకుండా ఇళ్లలో స్ప్రే చేయించారు. ప్రతి ఒక్కరూ దోమ తెరను వాడాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు శంకర్ నాయక్, మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, మునాఫ్, శ్రీధర్, మునాఫ్, సూపర్‌వైజర్లు గంగాధర, అశ్వత్థ నారాయణ, రమణయ్య, గీత, రామాంజనమ్మ, వరలక్ష్మి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింల నిరసన



నిరసన ర్యాలీ చేస్తున్న ముస్లిం, మైనార్టీలు

గుంతకల్లు రూరల్/గుంతకల్లు టౌన్: రాజ్యాంగానికి వ్యతిరేకంగా వక్ఫ్ బిల్లును ప్రవేశపెట్టారంటూ ముస్లిం, మైనార్టీలు గురువారం గుంతకల్లు పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ముస్లిం మైనార్టీ నాయకులు మాట్లాడుతూ దేశంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ఏర్పడినప్పటి నుంచి ముస్లిం,మైనార్టీలపై దాడులు ఎక్కువయ్యాయని, కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు. దేశంలో 20 కోట్లకు పైగా ఉన్న ముస్లింలు వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నారని, అయినప్పటికీ వక్ఫ్ బిల్లును ప్రవేశపెట్టడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బిల్లుకు నేరుగా మద్దతు తెలపడం చూస్తుంటే బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు ముస్లిం వ్యతిరేకం అన్నది స్పష్టం అవుతోందన్నారు. కార్యక్రమంలో ముస్లిం, మైనార్టీ నాయకులు ఎం.ఎం.రహమాన్, ఎండీఆర్ ఖలీల్, దాదా, అబ్దుల్ బాషిద్, సద్దాం, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మసీదుల వద్ద కరపత్రాల పంపిణీ

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించాలని కోరుతూ శుక్రవారం సీపీఎం నాయకులు మసీదుల వద్ద కరపత్రాలను పంపిణీ చేశారు. హిందుత్వ మతోన్మాద ఎజెండా అమలులో భాగంగా ఎన్డీఏ ప్రభుత్వం ముస్లింలపై విద్వేషాన్ని చిమ్ముతోందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు బి.శ్రీనివాసులు ఆరోపించారు సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, నాగరాజు, రమేష్, సురేంద్ర, అబ్దుల్లా, షాషా, హుసేన్ పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో సభలు


మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

తాడిపత్రిటౌన్ (యాడికి) : యాడికి మండలంలోని చింతలాయపల్లి, కుందనకోట గ్రామాల్లో శుక్రవారం ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన పంప్డ్ పవర్ స్టోరేజ్ ప్రాజెక్ట్ విషయమై ఆయా గ్రామాల్లో భూములు కోల్పోతున్న రైతులకు సామాజిక స్థితిగతుల అంశంపై గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ 950 మెగావాట్లతో పంప్డ్ పవర్ స్టోరేజ్ నిర్మాణం జరగనుందన్నారు. ఈ ప్రాజెక్టుకు ఎంత మేర భూములు కావాల్సి ఉంది? స్థానిక యవతకు ఉద్యోగ అవకాశాలు, పరిసరాల అభివృద్ధి, నీటి వనరుల వంటి వాటిపై అవగాహన కల్పించి రైతుల సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జెన్‌కో డీఈ ఆంజనేయులు, తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ వీరాజు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

గుంతకల్లుటౌన్: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తిని తీర్చడానికి అవోపా ఆధ్వర్యంలో శుక్రవారం మెయిన్‌రోడ్డు అమ్మవారిశాల కాంప్లెక్స్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు మజ్జిగ, చల్లని నీటిని అందజేశారు. కార్యక్రమంలో అవోపా అధ్యక్షుడు దారా రాము, కార్యదర్శి సుబ్రమణ్యం, కోశాధికారి రఘు, డాక్టర్ ప్రభాకర్, కౌన్సిలర్ కృపాకర్, జయంతి వెంకట్, మధు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు 'కూటమి' ద్రోహం

గుత్తి రూరల్: రాయలసీమ ఎత్తిపోతల పథకం అనుమతులు రద్దు చేసి కూటమి ప్రభుత్వం రైతులకు ద్రోహం చేసిందని వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖరరెడ్డి ఆరోపించారు. మండలంలోని కొత్తపేట గ్రామంలో ఖరీఫ్ సీజన్‌లో పంటలు పండక నష్టపోయిన పొలాలను శుక్రవారం వారు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రాయలసీమ ఎత్తిపోతల పథకం దాదాపుగా పూర్తి అయ్యే దశలో ఉండగా కూటమి ప్రభుత్వం, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ కలసి అనుమతులు రద్దు చేశాయన్నారు. ఏపీ ప్రజలు, రైతులు కూటమి నాటకాలను గమనించాలన్నారు. హంద్రీ-నీవా కాలువను వెడల్పు చేసేది పోయి సిమెంట్ లైనింగ్ పనులు చేస్తామని జిల్లా రైతులకు మరణశాసనం రాస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రామరంగారెడ్డి, గోపాల్‌రెడ్డి, హరినాథ్, కోటేశ్వరరావు, సాయినాథ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యం


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి

పెద్దవడుగూరు: మండలంలో బాల్య వివాహాలు జరగకుండా నివారించడమే లక్ష్యంగా పని చేయాలని డాక్టర్ శ్రీనివాసబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి సూచించారు. శుక్రవారం స్థానిక జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లలోపు ఆడపిల్లలకు వివాహాలు జరగడం వలన కలిగే నష్టాలను వివరించారు. బాల్య వివాహం చేయడం వలన రక్తహీనత ఏర్పడి తల్లీబిడ్డకు ప్రాణహాని కలిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే 1098కు సమాచారం అందించాలన్నారు. ఆడపిల్లలను బాగా చదివించడం వలన కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

8న మండల సమావేశం

పెద్దవడుగూరు/పామిడి: పెద్దవడుగూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 8న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బారెన్‌సాహెబ్ తెలిపారు. వ్యవసాయం, పశుపోషణ, వెలుగు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, ప్రాథమిక ఆరోగ్యం, తాగునీరు, రెవెన్యూ, గృహ నిర్మాణం, విద్యుత్, ప్రాథమిక విద్య, ఉపాధిహామీ, పంచాయితీరాజ్, హార్టికల్చర్, గ్రామ పంచాయతీలు, అటవీశాఖ, ఏపీఎస్ఆర్టీసీ, రోడ్లు, భవనాలు, మైనర్ ఇరిగేషన్, పట్టుపరిశ్రమ, మత్స్యశాఖ తదితర శాఖల అధికారులు ఉదయం 10:30 గంటలకు కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

▸▸ పామిడి ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 8న మండల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తేజోత్స్న శుక్రవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, సభ్యులు, అధికారులు హాజరు కావాలన్నారు.

సంక్షిప్త సమాచారం

డ్రోన్ వినియోగంపై పోలీసులకు శిక్షణ


డ్రోన్‌పై పోలీసులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని పెన్నానది ఒడ్డున శుక్రవారం డ్రోన్ వినియోగంపై పోలీసులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డ్రోన్ సాంకేతికతను వినియోగించి నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడి, శాంతిభద్రతలను పర్యవేక్షణ చేయనున్నట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు. శిక్షకుడు వీరేంద్రనాథ్‌రెడ్డి , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నార్మల్ డెలివరీపై అవగాహన

గుత్తి: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప ఆధ్వర్యంలో నార్మల్ డెలవరీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిజేరియన్ డెలవరీ చేస్తే తల్లీబిడ్డకు ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉంటుదన్నారు. నార్మల్ డెలవరీ వల్ల ఎలాంటి ప్రాణాపాయం ఉండదన్నారు. గర్భిణులు రోజూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రమ్యశ్రీ, నర్సులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

చీనీ మొక్కలు, డ్రిప్పు పరికరాల దగ్ధం

గుత్తి రూరల్: మండలంలోని మాముడూరు గ్రామంలో మౌలాలి స్వామి అనే రైతుకు చెందిన చీనీ మొక్కలకు నిప్పుపెట్టడంతో దగ్ధమయ్యాయి. బాధిత రైతు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు మౌలాలిస్వామి పొలంలో చీనీ చెట్లు సాగు చేశాడు. గురువారం రాత్రి తన సమీప బంధువు పొలం గట్టుపై ఉన్న చెత్తకు నిప్పు పెట్టడంతో ఐదు చీనీ మొక్కలతో పాటుగా డ్రిప్పు పైపులు, పరికరాలు కాలిపోయాయి. శుక్రవారం ఉదయం వెళ్లి చూడగా కాలిపోయిన విషయాన్ని రైతు గుర్తించాడు. చీనీ మొక్కలు, డ్రిప్పు పైపులు, పరికరాలు కాలిపోవడంతో తనకు రూ.40 వేలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

గార్లదిన్నె: కూటమి ప్రభుత్వం వెంటనే సంక్షేమ పథకాలు అమలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం అఖిల భారత రైతు కూలీ సంఘం సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలన్నారు. అలాగే పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులకు పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలన్నారు. హంద్రీనీవా లైనింగ్ పనులకు కోసం ప్రభుత్వం తెచ్చిన జీఓ 404,405లు రద్దు చేయాలన్నారు. హంద్రీనీవా కూడి కాలువ పది వేల క్యూసెక్కులు సామర్థ్యం గల కాలువగా వెడల్పు చేయాలన్నారు. రాయలసీమలోని ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం తహసీల్దార్ ఈరమ్మకు అందజేశారు. రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణ, ఏఐకేఎంఎస్ మండల కార్యదర్శి రాజశేఖర్, మంగమ్మ, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.